క్లుప్తంగా

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

రంగంపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 11న ప్రారంభమైన ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ఈ నెల 15వ తేదీ వరకూ జరుగుతాయని కళాశాల ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసరావు తెలిపారు. రోజూ ఉదయం, మధ్యాహ్నం రెండు పూటలా ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ పరీక్షా కేంద్రంలో 90 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని చెప్పారు. పరీక్షలకు సంబంధించి కేంద్రంలో అన్ని సదుపాయాలు కల్పించామన్నారు. మంగళవారం జరిగిన ప్రాక్టికల్ పరీక్షలకు 90 మంది హాజరు కావాల్సి ఉండగా నలుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారని తెలిపారు.

15న కంటి వైద్య శిబిరం

పెదపూడి: స్థానిక శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో పెదపూడిలో ఈ నెల 15న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నామని సేవా సమితి కాకినాడ జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ గోవిందరాజుల చౌదరి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ వేమగిరిలోని పరమహంస యోగానంద నేత్రాలయం వారిచే కంటి పరీక్షలు నిర్వహిస్తామన్నారు. కంటిలో శుక్లాలు ఉన్న వారికి ఆపరేషన్లు ఉచితంగా చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు విశ్వేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠోత్సవం

మధురపూడి: కోరుకొండ మండలం జంబూపట్నంలో ఉమా సమేత విశ్వేశ్వరస్వామి ఆలయం, స్వామివారి విగ్రహ ప్రతిష్ఠోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించనున్నారు. ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరవుతారు. ఉదయం 6 గంటల నుంచి పూజా కార్యక్రమాలు మొదలవుతాయి. ఈ సందర్భంగా ఉమా సమేత విశ్వేశ్వర స్వామి, మహాగణపతి, వీరభద్రస్వామి, వల్లీ దేవాసేనా సమేత సుబ్రహ్మణ్యేశ్వరుడు, అభయాంజనేయస్వామి విగ్రహాలను ప్రతిష్ఠిస్తారు. అలాగే మూడు ఉపాలయాలపై విమాన గోపుర శిఖర ప్రతిష్ఠలు జరుగుతాయి. అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహిస్తారు. ఇందులో భాగంగా మంగళవారం ఉదయం నుంచి హోమాలు, యంత్ర జపాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ ఉల్లి వీర వెంకట సత్యసూర్యకుమారి, వైఎస్సార్ సీపీ కోరుకొండ మండల మాజీ కన్వీనర్ ఉల్లి బుజ్జిబాబు, జంబూపట్నం సర్పంచ్ ఉల్లి అప్పన్నదొర, మాజీ సర్పంచ్ నాగా సత్తిబాబు, మాజీ పీఏసీఎస్ చైర్మన్ నాగా రమేష్, పార్టీ నాయకులు తోరాట ప్రసాద్ పాల్గొన్నారు.

సంఘ సభ్యుల వివరాల కంప్యూటరీకరణ



రంగంపేట సొసైటీలో సంఘ సభ్యుల వివరాలను కంప్యూటరీకరణ చేస్తున్న సిబ్బంది

రంగంపేట: ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ద్వారా సత్వర సేవలు అందించేందుకు సంఘ సభ్యుల వివరాలను కంప్యూటరీకరణ చేస్తున్నామని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పర్యవేక్షకుడు ఐ.జగన్నాథరావు తెలిపారు. మంగళవారం స్థానిక ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం కార్యనిర్వాహణాధికారి బి.త్రిమూర్తులు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కంప్యూటరీకరణ పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. రంగంపేట సంఘం పరిధిలో 10 గ్రామాల రైతులు, 2794 మంది సభ్యులుగా ఉన్నారని వారందరి వివరాలను ఆధార్‌తో అనుసంధానం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంఘ సీఈఓ కె.వెంకటేశ్వర్లు, సిబ్బంది ప్రసాద్, గంగాధర్, రామకృష్ణ, ఈశ్వరరావు పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలపై న్యాయవిజ్ఞాన సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రత్యూష కుమారి

కంబాలచెరువు: డ్రైవింగ్ లైసెన్సులు, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు, సమస్యల పరిష్కారం, రోడ్డు ప్రమాదాల నివారణపై మంగళవారం న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ, జిల్లా రోడ్డు రవాణా అధికారుల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి మాట్లాడుతూ డ్రైవింగ్ లైసెన్సులు, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు జారీ విషయంలో సంబంధిత అధికారులు పాటించాల్సిన నిబంధనలను వివరించారు. పరిమిత వేగంతో, భద్రత ప్రమాణాలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలు చాలా వరకు తగ్గించవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని, వాహనాలు నడిపే సమయంలో నిర్లక్ష్యంగా ఉండరాదన్నారు. మోటారు వాహనాల ఇన్‌స్పెక్టర్ సీహెచ్ సంపత్ కుమార్ వివిధ ట్రాఫిక్ చిహ్నాలను వివరించారు. సదస్సులో అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎన్.విలియం కేరీ, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బి.బాల మురళీకృష్ణ, మెప్మా కార్యకర్తలు, వార్డు వాలంటీర్లు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

కొబ్బరి పువ్వులతో జీవనోపాధి

- జోరుగా విక్రయాలు
- రోడ్డు పక్కనే చిరు వ్యాపారుల దుకాణాలు



కొబ్బరి కాయలోని పువ్వు



జాతీయ రహదారి పక్కన విక్రయిస్తున్న కొబ్బరి పువ్వుతో కూడిన కాయలు

రాజానగరం: రెక్కాడితేగాని డొక్కాడని కూలీలు ఖరీఫ్, రబీ సీజన్లలో వ్యవసాయ పనులు పూర్తయిన తర్వాత కొన్ని రోజులు సరైన పని దొరకక ఇబ్బంది పడుతూ ఉంటారు. అటువంటి సమయంలో ఏదొక పని చేసుకుని, జీవనోపాధి పొందుతారు. కొందరైతే సీజనల్ వారీగా దొరికే కాయలు, పండ్లను అమ్ముకుంటూ కుటుంబాలను పోషించుకుంటారు. ఆ కోవకు చెందిన కొందరు వ్యక్తులు రావులపాలెం, మోరంపూడి, లాలాచెరువు, దివాన్‌చెరువు, రాజానగరం వంటి ప్రాంతాలలో జాతీయ రహదారికి ఇరువైపులా నిత్యం దర్శనమిస్తూనే ఉంటారు.

కొబ్బరి పువ్వుల అమ్మకాలే ఉపాధి

కాటకోటేశ్వరం, నిడదవోలు, సూరంపాలెం తదితర ప్రాంతాలకు చెందిన కొందరు కొబ్బరి పువ్వులను విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నారు. పైప్రాంతాలకు చెందిన సుమారు పది మంది ప్రస్తుతం జాతీయ రహదారిపై రాకపోకలు సాగించే వారికి, నగరవాసులకు సైకిళ్లపై పెట్టుకుని ఈ కొబ్బరి పువ్వులను విక్రయిస్తున్నారు. కొబ్బరికాయ ఒక్కంటికీ మార్కెట్‌లో రూ.15 నుంచి రూ.25 ధర పలుకుతున్న నేపథ్యంలో కొబ్బరి పువ్వులతో ఉండే కొబ్బరి కాయలను అవకాశాన్ని బట్టి మూడు కాయలను రూ.150 లకు విక్రయిస్తున్నారు. ఒక్కటే కావాలంటే రూ.75 చెల్లించాల్సిందే.

రుచి మధురం

కొబ్బరి పువ్వు రుచి ఎంతో బాగుంటుంది. కోనసీమ వాసులకు ఇది సర్వసాధారణమే. కానీ ఇతర ప్రాంతాల వారికి ప్రత్యేకంగా ఉంటుంది. చాలామంది వీటిని కొనుగోలు చేసుకుని, ఇళ్లకు తీసుకువెళ్తున్నారు. కొబ్బరి పువ్వులు ఎక్కువగా కొబ్బరి రాశులలో లభిస్తుంటాయి. కొబ్బరి తోటలు, గోడౌన్‌లలో రాశులుగా పోసి, నిల్వ చేసిన కొబ్బరి కాయలలో ముదిరిన వాటి నుంచి మొక్కలు వస్తుంటాయి. వాటిని ఏరి తీసేస్తుంటారు. అలాగే కొన్ని ప్రాంతాలో కొబ్బరి నార్లు కట్టి మొలకలు వచ్చిన తరువాత పువ్వుల కోసం వచ్చే వారికి విక్రయిస్తుంటారు. ఆ విధంగా రైతులు, వ్యాపారుల నుంచి కొనుగోలు చేసిన కాయలను పూర్తిగా ఒలిచేసి, ఈ చిరు వ్యాపారులు ఊరూరా తిరుగుతూ, రోడ్ల పక్కన అమ్ముతుంటారు.

పనులు లేని సమయంలో..

వ్యవసాయ పనులు లేని సమయాల్లో ఖాళీగా ఉండలేక, బతుకు జీవనం కోసం కొబ్బరి పువ్వులను అమ్ముతుంటాం. కమతాలలో రైతుల నుంచి కొద్దిపాటి మొక్కలొచ్చిన కాయలను కొనుగోలు చేసి, వాటిని ఒలిచి శుభ్రపరుస్తాం. ఆ తర్వాత సైకిళ్లపై పెట్టుకుని, నగర వాసులకు, ప్రయాణాలు చేసేవారికి అమ్ముతూ జీవనోపాధి పొందుతున్నాం. వీటి విక్రయాల ద్వారా రోజుకు కూలి సొమ్ములు గిట్టుబాటు అయితే చాలన్నట్టుగానే మా వ్యాపారాలుంటాయి.

– మరుకుర్తి శ్రీనివాసరావు, నిడదవోలు

సుబ్రహ్మణ్యేశ్వరునికి అభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారు

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలులో కొలువైన కుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మాఘ మాసం మంగళవారం కావడంతో స్వామి వారికి భారీగా అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం భక్తుల కోసం అన్నసమారాధన నిర్వహించారు.

ఐక్యకార్యాచరణసమితి సమావేశం

మధురపూడి: ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల ఐక్యకార్యాచరణ సమితి కోరుకొండ యూనిట్ సమావేశం మంగళవారం కోరుకొండలో జరిగింది. జేఏసీ అధ్యక్షులు చొల్లంగి త్రినాథ్ సూర్యకుమార్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో బుధవారం నుంచి ఈనెల 17వ తేదీ వరకూ ఆందోళనలు చేయాలని తీర్మానం చేశారు. సమావేశంలో యూటీఎఫ్, పీఆర్టీయూ, ఎన్‌జీఓ నాయకులు పాల్గొన్నారు.

ఫ్యూజ్ ఆఫ్ కాల్ సెంటర్ ప్రారంభం



అనపర్తిలో ఫ్యూజ్ ఆఫ్ కాల్ సెంటర్‌ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

అనపర్తి: అనపర్తిలో నూతనంగా నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌లో విద్యుత్ వినియోగదారులకు అందుబాటులో ఉండే విధంగా ఫ్యూజ్ ఆఫ్ కాల్ సెంటర్ ఆఫీసును ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మంగళవారం ప్రారంభించారు. విద్యుత్ శాఖ డీఈ ఎం.నిరంజన్‌బాబు మాట్లాడుతూ విద్యుత్ బిల్లులు చెల్లించుకునేందుకు, విద్యుత్‌కు సంబంధించి ఫిర్యాదుల పరిష్కారానికి ఈ కార్యాలయం ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వారా కుమారి, ఉప సర్పంచ్ చిర్ల వీర్రాఘవరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ సత్తి రామకృష్ణారెడ్డి, రంగంపేట మండల పార్టీ ఇన్‌చార్జి నల్లమిల్లి బాలమురళీకృష్ణారెడ్డి, ఏఈ వి.వీరభద్రరావు, సిబ్బంది పాల్గొన్నారు.

జగన్ ప్రభుత్వంలో మహిళా సాధికారత

- వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి
- దోసకాయలపల్లిలో సమావేశం



జక్కంపూడి విజయలక్ష్మిని సత్కరిస్తున్న మహిళలు

మధురపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో మహిళా సాధికారత సాకారమైందని, అన్ని రంగాల్లో అభ్యున్నతి సాధిస్తున్నారని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. కోరుకొండ మండలం దోసకాయలపల్లి సచివాలయంలో మంగళవారం డ్వాక్రా మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ సమస్యలన్నింటినీ పరిష్కరించాలన్న లక్ష్యంతోనే గ్రామాల్లో సమావేశాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఎన్నికల మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంలా భావించి, హామీలన్నింటినీ అమలు జరుపుతున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. నవరత్నాల సంక్షేమ పథకాలతో మహిళలకు ఆర్థికంగా, సామాజికంగా భరోసా కల్పించారన్నారు. మహిళా పక్షపాతిగా నిలిచిన జగన్‌కు రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఓటేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు కడవల వివ, పీఏసీఎస్ చైర్మన్ గొల్లవిల్లి మురళీ, నాయకులు కోన శ్రీనివాస్, అప్పారావు, గిరి పాల్గొన్నారు.

16న గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మె



సమావేశంలో మాట్లాడుతున్న చీకట్ల వెంకటేశ్వరరావు

రాజానగరం: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 16న తలపెట్టిన గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెలను విజయవంతం చేయాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) జిల్లా కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు కోరారు. మండలంలోని పాతతుంగపాడులో పీడబ్ల్యూడీ మెట్టపై మంగళవారం సన్నాహక సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పదేళ్ల బీజేపీ పాలనలో అదానీ, అంబానీలు ప్రపంచ కుబేరుల జాబితాలో చేరారుగానీ, దేశంలో పేదలు మాత్రం మరింత పేదరికంలోకి కూరుకుపోయారన్నారు. కార్పొరేట్ సంస్థలు, కంపెనీలకు రాయితీలిచ్చి ప్రోత్సహించే ప్రభుత్వం .. నిత్యావసర వస్తువులపై జీఎస్టీలు వేసి, సామాన్యుడి బతుకును భారం చేసిందన్నారు. దేశంలో ఒకటిన్నర లక్షల మంది వ్యవసాయ కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విభజన హామీలలో ఒకటైన ప్రత్యేక హోదాను ఇవ్వకుండా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధికి గండి కొట్టిన ఘనత కూడా బీజేపీ ప్రభుత్వానిదేనన్నారు. రాయలసీమ, ఉత్తరాంధ్రలకు ప్రత్యేక ప్యాకేజీలు లేవు, పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు నష్టపరిహారం, పునరావాసాలకు గురించి పట్టించుకోవడం లేదు, రైల్వే జోన్ ఊసే లేదంటూ కేంద్ర ప్రభుత్వ తీరును దుయ్యబట్టారు. రైస్ మిల్లు జట్టు కార్మిక సంఘాల అధ్యక్షుడు నల్ల శ్రీను అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో చల్లా శ్రీను, రాయి రాంబాబు, గంధం శ్రీను, మేడపాటి సత్తిబాబు, కొప్పిశెట్టి రాంబాబు పాల్గొన్నారు.

ఒత్తిడిని అధిగమిస్తే ఉత్తమ ఫలితాలు



పందలపాకలో విద్యార్థులకు అవగాహన కలిస్తున్న విశ్రాంత ప్రొఫెసర్ పడాల శ్రీనివాసరెడ్డి

బిక్కవోలు: ఒత్తిడిని అధిగమిస్తే ఉత్తమ ఫలితాలు సాధించొచ్చని విశ్రాంత ప్రొఫెసర్ పడాల శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని పందలపాక శ్రీపడాల పెదపుల్లారెడ్డి ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి విద్యార్థులు చదువుకోవాల్సిన విధానం, పరీక్షల ఒత్తిడిని ఎలా అధిగమించాలో వివరించారు. అనంతరం విశ్రాంత ప్రొఫెసర్ శ్రీనివాసరెడ్డిని పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరెడ్డి సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జయకృష్ణారెడ్డి, కేవీ కృష్ణారెడ్డి, పీడీ యువ రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో విద్యార్థుల ప్రతిభ



జేఈఈ మెయిన్స్‌లో సత్తా చాటిన ప్రతిభ విద్యార్థులు

కంబాలచెరువు: ఐఐటీ, జేఈఈ మెయిన్స్ పరీక్షల్లో దానవాయిపేటలోని ప్రతిభ జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యధిక పర్సంటైల్స్ సాధించారని ఆ విద్యాసంస్థల చైర్మన్ ప్రతిభామూర్తి మంగళవారం తెలిపారు. టి.ప్రతీవర్ధన్ 99.86, బి.శశిర 99.01, జి.దుర్గావిఘ్నేష్ 99.01 పర్సంటైల్స్ సాధించారన్నారు. మరో 16 మంది 97 పర్సంటైల్స్ సాధించారన్నారు. అంతేకాక 50 మంది విద్యార్థులు అడ్వాన్స్‌డ్ పరీక్షకు అర్హత సాధించారన్నారు. ఈ సందర్భంగా విజేతలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సభలో అకడమిక్ డైరక్టర్ శ్రీకాంత్, ప్రిన్సిపాల్ సాగర్ అభినందించారు.

లారెల్ హైగ్లోబల్ స్కూల్ విద్యార్థుల సత్తా

మధురపూడి: కోరుకొండ మండలం గాడాలలోని లారెల్ హైగ్లోబల్ స్కూల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ విద్యార్థులు జేఈఈ మెయిన్ ఫలితాల్లో విజయఢంకా మోగించారు. 58 మంది విద్యార్థులు హాజరు కాగా, 26 మంది అడ్వాన్స్‌డ్ పరీక్షకు అర్హతను సాధించారు. ఈ సందర్భంగా మంగళవారం స్కూల్లో పండగ సందడి ఏర్పడింది. సంస్థ డైరెక్టర్ సుంకర రవికుమార్ అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బందిని అభినందించారు. ఆయన మాట్లాడుతూ అధ్యాపకుల సమష్టి కృషి ఫలితంగా మంచి ఫలితాలు వచ్చాయన్నారు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ హెడ్ గురునాథ్ మాట్లాడుతూ పరీక్షకు హాజరైన 58 మందిలో 15 మంది 90 శాతంపైగా పర్సంటేజ్ సాధించారని, 99.40 శాతం పర్సెంటేజ్‌తో ముప్పల సాయి శైలేష్ ప్రథమస్థానంలో నిలిచినట్టు తెలిపారు. తొలి ప్రయత్నంలోనే మంచి ఫలితాలను సాధించినందుకు అభినందనలు తెలిపారు.

నేడు జక్కంపూడి రామ్మోహనరావు విగ్రహావిష్కరణ

ధవళేశ్వరం: గ్రామంలోని పోలీస్ స్టేషన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన దివంగత మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు విగ్రహాన్ని బుధవారం ఉదయం 11 గంటలకు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ఆవిష్కరించనున్నారు. ఈ విషయాన్ని విగ్రహ ఆవిష్కరణ కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, ఏపీజీఅండ్‌బీసీ చైర్మన్ చందన నాగేశ్వర్, వైఎస్సార్ సీపీ యువజన విభాగం ఉభయ గోదావరి జిల్లాల కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. జక్కంపూడి అభిమానులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

ఎన్నికల నియమావళిపై అవగాహన

రాజానగరం: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ తోడ్పాటు అందించాలని రాజకీయ నాయకులకు బొమ్మూరు పోలీసులు విజ్ఞప్తి చేశారు. దివాన్‌చెరువులో మంగళవారం ఎన్నికల నియమావళి, నిబంధనలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రచారానికి ఉపయోగించే ర్యాలీలు, మైకు సెట్లుకు అనుమతులు, జెండాలు, బ్యానర్లు కట్టే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోలింగ్ బూత్‌ల వద్ద వ్యవహరించే తీరు తదితర వాటిని వివరించారు.

ఘనంగా జాతీయ మహిళా దినోత్సవం



మాట్లాడుతూ ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టిబాబు

సీతానగరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికార విభాగం కన్వీనర్ డాక్టర్ ఎం.సుధామయి అధ్యక్షతన మంగళవారం జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు మాట్లాడుతూ సరోజినీ నాయుడు తదితర దేశభక్తులైన మహిళామణుల స్ఫూర్తితో విద్యార్థినులందరూ ప్రగతి పథంలో పయనించాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ కె.హరే రామకృష్ణ మాట్లాడుతూ లక్ష్యాన్ని నిర్దేశించుకుని, ముందుకు సాగి విజేతలు కావాలని ఆకాంక్షించారు. డాక్టర్ సుధామయి మాట్లాడుతూ సరోజినీ నాయుడు బెంగాల్‌లో పుట్టి, తెలుగు వ్యక్తి గోవిందరాజులు నాయుడును వివాహమాడారన్నారు. తెలుగింటి కోడలై అనేక భాషల్లో ప్రావీణ్యం సంపాదించారన్నారు. స్వాతంత్ర్య సమరంలో గాంధీజీకి కుడిభుజంగా, మహిళల్లో చైతన్యాన్ని నింపి భారత కోకిలగా చరిత్రలో ధ్రువతారగా నిలిచారని ప్రశంసించారు. మహిళాసాధికార విభాగం కో కన్వీనర్ ఎ.వాణి, అధ్యాపకులు సుబ్బారావు, డాక్టర్ నాగేశ్వరరావు, జనార్దన్, మీనాక్షి, వెంకటేష్, ఫణీంద్ర, మనోహరి, వరలక్ష్మి పాల్గొన్నారు.

ధ్యానంతో సృజనాత్మక శక్తి

కంబాలచెరువు: ధ్యానంతో సృజనాత్మక శక్తి పొందవచ్చని కమ్యూనిటీ పారామెడిక్స్, ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బళ్లా శ్రీనివాసరావు అన్నారు. స్థానిక 3వ వార్డు నెహ్రూనగర్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్లో పదో తరగతి విద్యార్థులకు యోగా మాస్టర్ తీడా రాము ఆధ్వర్యంలో జరుగుతున్న శిక్షణలో భాగంగా మంగళవారం ధ్యానం, సహజ యోగం ప్రక్రియలపై వివరణాత్మక తరగతులు నిర్వహించారు. బళ్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ ధ్యానం ద్వారా ఒత్తిడి తగ్గి ప్రశాంతంగా పరీక్షలు రాసేందుకు దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కేవీవీ సత్యనారాయణ, వ్యాయామ ఉపాధ్యాయురాలు జి.సత్యవేణి, మాతాజీ నిర్మలా దేవి పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం



అనపర్తిలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

అనపర్తి: గ్రామాల సర్వతోముఖాభివృద్ధి కోసం మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. అనపర్తిలో మంగళవారం ఆయన పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు చేశారు. స్థానిక పల్లీల రామాలయం వద్ద రూ.10 లక్షలతో నిర్మించిన సీసీరోడ్లు, డ్రైన్లు, రూ.3.50 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, బుల్లియ్యతోట వద్ద రూ.15.40 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, సచివాలయం-3 పరిధిలో రూ.6.60 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, ధరణికోట పరిధిలో రూ.16.50 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రైన్లు, టీటీడీ కల్యాణ మండపం వద్ద రూ.35.90 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రైన్లు, చాకలిపేట వద్ద రూ.7.50 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, బావనమ్మ తల్లి ఉపాలయం వద్ద జలజీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా రూ. 2.21 కోట్లతో నిర్మించిన తాగునీటి కుళాయిలు, పైప్‌లైన్లను, తహసీల్దార్ కార్యాలయం వద్ద రూ. 14 లక్షలతో సీసీరోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం కొప్పవరం లేఅవుట్ వద్ద రూ.16.70 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటికే అనపర్తి గ్రామాన్ని రూ.63 కోట్లతో అభివృద్ధి చేశామని, మంగళవారం ఒక్కరోజే రూ.3.46 కోట్లతో వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించామన్నారు. ఇంత అభివృద్ధి గతంలో ఎన్నడూ ఏ ప్రభుత్వ హయాంలోనూ జరగలేదన్నారు. అనపర్తిలో ప్రజలందరికీ మంచినీరు, రోడ్లు, డ్రైన్లు కల్పించడానికి తన వంతు కృషి చేస్తానని ప్రజలందరూ చేసిన అభివృద్ధి గమనించాలన్నారు.

ప్రత్యేక అవసరాల విద్యార్థులపై శ్రద్ధ వహించాలి



రంగంపేట భవిత కేంద్రంలో విద్యార్థులతో ముచ్చటిస్తున్న స్నేహలత

రంగంపేట: ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులపై శ్రద్ధ వహించాలని జిల్లా సమగ్ర శిక్ష అకౌంట్స్ అధికారి జె.స్నేహలత సూచించారు. మండల కేంద్రంలోని భవిత కేంద్రాన్ని మంగళవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవిత కేంద్రాల్లోని ప్రత్యేకావసరాలు గల విద్యార్థులకు టేబుల్స్‌ను బాగా వినియోగిస్తూ శాస్త్ర, సాంకేతిక విద్యాభ్యాసాన్ని కొనసాగించడం బాగుందన్నారు. ట్యాబ్స్ వంటి బోధనోపకరణాలు వినియోగంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల కృషిని ఆమె అభినందించారు. జిల్లాలో 19 భవిత కేంద్రాలు ఉన్నాయని, ఆ కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన వినికిడి యంత్రాలు, కృత్రిమ అవయవాలు సమకూర్చామన్నారు. వారానికోరోజు ఫిజియోథెరఫీ ద్వారా శారీరక ఆరోగ్యంపై విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ప్రయోగాత్మక శిక్షణ ఇస్తున్నామన్నారు. జిల్లాలో రంగంపేట భవిత కేంద్రం నిర్వహణలో ఐఈఆర్టీ కో-ఆర్డినేటర్లు ముద్రగడ ప్రసాద్, జి.అంజలి కృషిని ఆమె ప్రశంసించారు. కార్యక్రమంలో సీఆర్ఎంటీ ఎల్.శ్రీనివాసరాజు, ఉపాధ్యాయుడు పి.సూర్యకృష్ణ పాల్గొన్నారు.

పేదలకు వరం జగనన్న ఆరోగ్య సురక్ష



తొస్సిపూడిలో రోగులను పరీక్షిస్తున్న వైద్యురాలు

బిక్కవోలు: పేదలకు వరం జగనన్న ఆరోగ్య సురక్ష అని వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు నల్లమిల్లి త్రినాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం తొస్సిపూడి సచివాలయం వద్ద జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత శిబిరంలో రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా త్రినాథ్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని తీసుకొచ్చారన్నారు. కార్యక్రమంలో కొంకుదురు పీహెచ్‌సీ వైద్యురాలు విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి అచ్చియ్య చౌదరి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ముందు బుల్లెట్టు బండి.. వెనుక పెళ్లి సందడి..



బిక్కవోలులో పెళ్లికూతురుని రాజకుమారిలా ఊరేగిస్తున్న దృశ్యం

బిక్కవోలు: నీ బుల్లెట్టు బండెక్కి వచ్చేత్తాపా.. డుగు.. డుగు.. డుగు.. డుగని.. అంటూ పెళ్లి కూతురు చేసిన డ్యాన్స్ ఎంతటి సంచలనం సృష్టించిందో తెలిసిందే.. అక్కడి నుంచి మొదలు ఇటీవల ఎక్కడ పెళ్లిళ్లు జరిగినా పెళ్లికొడుకు, పెళ్లి కూతుర్ల డ్యాన్స్‌లే కాకుండా పెళ్లి వేడుకలను సైతం వినూత్నంగా నిర్వహించడం సర్వసాధారణమైపోయింది. ఇప్పుడది పట్టణాలే కాకుండా పల్లెలకూ వ్యాపించింది. మంగళవారం బిక్కవోలుకు చెందిన దిగువల్లి వెంకటేశ్వరరావు, రామలక్ష్మి దంపతుల కుమార్తె దేవి పెళ్లి ఊరేగింపుని వినూత్నంగా నిర్వహించారు. చీరలు ధరించిన యువతులు బుల్లెట్ బండ్లు నడుపుతుంటే వెనుక పల్లకీలో పెళ్లికూతురుని రాజకుమారిలా ఊరేగిస్తూ తీసుకొచ్చారు. దీంతో ఈ ఊరేగింపుని గ్రామస్తులు ఆసక్తిగా తిలకించారు.